


పోలీసుల అదుపులో నిందితుడు

మైనర్ బాలికను ఎత్తుకెళ్లి హత్య చేసి పరారైన నిందితుడు బత్తిన నాని ఎట్టకేలకు పెద్దాపురం పోలీసులకు చిక్కాడు. 8లో▸



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 4,200,మధ్య డెల్టాకు 2,200,పశ్చిమ డెల్టాకు 7,000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గెలుపు పొందు వరకు...



జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్‌లో తమ ప్రతిభా నైపుణ్యాన్ని ప్రదర్శించి, చాంపియన్ షిప్ సాధించడమే లక్ష్యంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

బాలాజీ హుండీ ఆదాయం రూ.28.67 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. స్వామివారికి 67 రోజులకు గాను హుండీల ద్వారా రూ.28.67 లక్షల ఆదాయం వచ్చింది. అమలాపురం దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. హుండీల ద్వారా రూ.27.98 లక్షలు, అన్నదానం హుండీ ద్వారా రూ.69,071 ఆదాయం వచ్చింది. 8.900 గ్రాముల బంగారం, 435 గ్రాముల వెండి హుండీల్లో భక్తులు కానుకలుగా సమర్పించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ గెద్దం కృష్ణమూర్తి, ట్రస్టుబోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, మానుపాటి సూర్యకుమారి, బొరుసు పార్వతీదుర్గాభవాని పాల్గొన్నారు.

కంద దుంపకు అరటి గెల!



తిళ్లకుప్పలో కంద దుంపకు మొలిచిన అరటి గెలను చూపిస్తున్న రైతు

ఐ.పోలవరం: మండలంలో ఓ రైతు పొలంలో వింత చోటు చేసుకొంది. ఐ.పోలవరం మండలం తిళ్లకుప్ప గ్రామంలో రైతు వేగిరాజు సుబ్బరాజు ఇంటి దగ్గర పొలంలో కంద దుంపకు అరటి గెల వేసింది. రైతు పొలంలో దూడలకు గడ్డి కోస్తుండగా ఇది కంటపడింది. ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో జనం వచ్చి చూస్తున్నారు.

లంబో'ధర' లడ్డూ !



దక్కించుకున్న లడ్డూతో సతీష్ తదితరులు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216 సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక లడ్డూ రూ.1,01,116 ధర పలికింది. స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మంటపంలో గణపతి నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో స్వామివారి లడ్డూను సుంకరపాలెం సతీష్ బైక్ మెకానిక్ వర్క్స్ అధినేత, ఇంజరం గ్రామానికి చెందిన కాండ్రేగుల సతీష్ రూ.1,01,116కు దక్కించుకున్నారు.



శరవేగంగా రీ సర్వే

- జోరుగా జగనన్న భూ సర్వే
- 328కు 166 గ్రామాల్లో నిర్వహణ
- రెండు దశల్లో 111 చోట్ల పూర్తి
- మూడవ దశలో 55 గ్రామాల ఎంపిక
- నాలుగు మండలాల్లో మొదలు కాని వైనం

సాక్షి అమలాపురం: భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి చేపట్టిన 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూరక్ష పథకం'లో రీ సర్వే జిల్లాలో శరవేగంగా సాగుతోంది. తొలిదశలో ఎదురైన అవాంతరాలను, సమస్యలను అధిగమించిన జిల్లా యంత్రాంగం రెండు, మూడవ దశ సర్వేను వేగంగా పూర్తి చేస్తోంది. ఇప్పటికే రెండవ దశ పూర్తి కాగా, మూడవ దశ రీ సర్వే వేగంగా సాగుతోంది. సర్వే పక్కాగా పూర్తయిన చోట గ్రామ సచివాలయాల్లోనే భూ రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే.

మూడు దశలలో సర్వే ఇలా..

- జిల్లాలో తొలి దశలో 67 గ్రామాల్లో జగనన్న రీ సర్వే జరిగింది. ఈ సమయంలో పలు అవాంతరాలు ఏర్పడ్డాయి. సఖినేటిపల్లితోపాటు తీర ప్రాంత మండలాల్లో ఆక్వా చెరువులు, సహజ సిద్ధంగా ఏర్పడిన పర్రభూముల వల్ల డ్రోన్ సర్వేలకు ఇబ్బంది ఏర్పడింది. నీరు వల్ల ఇమేజ్‌లు రిఫ్లెక్ట్ కావడంతో ఇక్కడ సర్వే ఆలస్యమైంది. పైగా తొలి దశ జరిగిన గత ఏడాది జూలై నెల నుంచి సెప్టెంబర్ వరకు మూడు దఫాలుగా గోదావరికి వరద పోటెత్తడంతో రెవెన్యూ అధికారులు సహాయ పునరావాస చర్యల్లో నిమగ్నం కావడం కూడా సర్వేపై ప్రభావం పడింది. కాని రెండవ దశ, మూడవ దశ సర్వేలో ఈ పరిస్థితి లేదు.
- రెండవ దశ 13 మండలాల్లో సాగింది. 54 గ్రామాల్లో సర్వే జరిగింది. సర్వే పూర్తయిన చోట సరిహద్దులో పాతేందుకు 81,225 రాళ్లను సిద్ధం చేశారు. జిల్లాలో కపిలేశ్వరపురం, రావులపాలెం, రామచంద్రపురం, కొత్తపేట, మండపేట, కె.గంగవరం, అంబాజీపేట, మామిడికుదురు, రాయవరం, ఆలమూరు, అమలాపురం, ఆత్రేయపురం, రాజోలులో సర్వే జరిగింది. అధిక విస్తీర్ణం ఉన్న గ్రామాలైన రామచంద్రపురం మండలం వెలంపాలెం, మండపేట మండలం వేములపల్లి, రావులపాలెం మండలం దేవరపల్లి, అమలాపురం మండలం బండారులంక, ఇందుపల్లి, కొత్తపేట మండలం అవిడి, కె.గంగవరం మండలం దంగేరు వంటి గ్రామాల్లో కూడా సర్వే వేగంగా ముగిసింది.
- మూడవ దశలో 14 మండలాల్లో 55 గ్రామాలు ఎంపికయ్యాయి. ఆత్రేయపురం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, మండపేట, రావులపాలెం, ఆలమూరు, పి.గన్నవరం, కాట్రేనికోన, అయినవిల్లి, అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట, రాజోలు, కె.గంగవరంలో సర్వే మొదలై వివిధ దశలలో ఉంది. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి, ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలం చెయ్యేరు, మండపేట మండలం కేశవరం, రావులపాలెం మండలం గోపాలపురం, కాట్రేనికోన మండలం కందికుప్ప, అయినవిల్లి మండలం నేదునూరు గ్రామాలు పెద్దవి.



ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లిలో రీ సర్వేకు సంబంధించి మ్యాప్‌లు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

సాగుతోంది ఇలా..

- రీ సర్వేకు ఎంపిక చేసిన గ్రామంలో తొలుత గ్రామ సరిహద్దులను నిర్ణయిస్తున్నారు. ముందుగా ప్రభుత్వ స్థలాలను గుర్తించి రాళ్లు పాతుతున్నారు. ఆపై గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులకు రీ సర్వేపై అవగాహన కల్పిస్తున్నారు. వలంటీర్లు రైతులకు ముందుగానే సమాచారం అందజేస్తున్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ ఏజెన్సీల ఆధ్వర్యంలో డ్రోన్ సర్వేలు జరుగుతున్నాయి.
- డ్రోన్ ఇమేజ్‌లు ల్యాబ్‌లకు వెళ్లిన తరువాత అక్కడ నుంచి వచ్చే భూములకు సంబంధించిన ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్)లను పరిశీలిస్తున్నారు. పీజీఎఫ్ఎస్ఐ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా ఇమేజ్‌ల క్వాలిటీని చెక్ చేస్తున్నారు. వీటి ఆధారంగా గ్రౌండ్ ట్రూతింగ్ (క్షేత్రస్థాయికి వెళ్లి హద్దుల నిర్ణయం) జరుగుతోంది.
- రైతుల వద్ద నుంచి వారి భూమి రికార్డులు, సర్వే నంబర్ పరిశీలించి ఆ భూములకు తాత్కాలికంగా ఎల్పీఆర్ ఇస్తున్నారు. ఇదే గ్రౌండ్ వాల్యూయేషన్. రైతులకు అభ్యంతరాలు ఉంటే అపీలుకు వెళ్లే అవకాశం ఉంది.

నెలాఖరు నాటికి సరిహద్దు రాళ్ల ఏర్పాటు



వైఎస్సార్ జగనన్న రీ సర్వేకు సంబంధించి జిల్లాలో రెండవ దశ పూర్తయిన గ్రామాలలో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసే ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రీ సర్వే జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయనున్నాం. సర్వే పూర్తయిన చోట యజమానులకు భూ హక్కు పత్రాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.నూపుర్, జాయింట్ కలెక్టర్

గ్రేటర్ కమ్యూనిటీ అపార్టుమెంట్లలో పోలింగ్ కేంద్రాలు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సత్తిబాబు

అమలాపురం రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టణాలలో ఓటింగ్ శాతాన్ని పెంచే దిశగా గ్రేటర్ కమ్యూనిటీ అపార్టుమెంట్లలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటర్ల జాబితా సవరణ విధి విధానాలను విశదీకరించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలలో క్యూ ల ఏర్పాటు, జాగాలు లేనిచోట్ల మూడు కిలోమీటర్లు పరిధి దాటి ఉన్న పోలింగ్ కేంద్రాల మార్పు, ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 ప్రక్రియ వివరించారు. మాట్లాడుతూ ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయిలో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండినవానిరి ఓటుహక్కు కల్పించడమే ప్రధాన అంశంగా సవరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జనవరిలో తుది జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ సవరణ ప్రక్రియలో 1,500 ఓటర్లు దాటిన చోట అదనంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. దూరాభారాలను పరిగణనలో తీసుకొని జిల్లావ్యాప్తంగా మూడు నూతన పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామన్నారు. ఈ సవరించిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురణ అక్టోబర్ 27వ తేదీన నిర్ధారించారన్నారు. అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు పరిష్కరించుకోవచ్చునన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి అల్లాడి స్వామినాయుడు పాల్గొన్నారు.



ట్రాలీలపై కొలువుదీరిన చిరు గణనాథులు



ట్రాలీలపై వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

ట్రాలీలపై గణనాథుల ర్యాలీ

పి.గన్నవరం: గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా బుధవారం వాడ్రేవుపల్లి శివారు చాకలిపాలెంలో ట్రాలీలపై చిరు గణనాథుల ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చాకలిపాలెం సెంటర్ నుంచి సోంపల్లి రేవు వరకూ 31 చిన్న ట్రాలీలపై 31 వినాయకుని ఉత్సవ విగ్రహాలను మహిళలు, పిల్లలు ఊరేగించి వశిష్ట నదీపాయలో నిమజ్జనం చేశారు. 10 సంవత్సరాలుగా గ్రామంలో న్యాయవాది మొల్లేటి శ్రీనివాసరావు కుటుంబం ఆధ్వర్యంలో ఏటా ఆర్‌పీ రోడ్డు పక్కన ఉయ్యాలలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆయన ఇంటి సమీపంలోని కుటుంబాల వారు చిన్న, చిన్న వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. నిమజ్జనం రోజున ముందు వాహనంలో ఉయ్యాల గణపతిని ఉంచి.. దాని వెనుక 30 ట్రాలీల్లో ఇతర కుటుంబాలకు వారు పూజలు చేసిన విగ్రహాలను అమర్చి చిన్నారులు, మహిళలు ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సోంపల్లి వరకూ ట్రాలీలపై చిరు గణనాథులను ఊరేగించి వశిష్ట నదీపాయలో నిమజ్జనం చేశారు. దారి పొడవునా గ్రామస్తులు, ప్రయాణికులు ఈ నిమజ్జన యాత్రను సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు.

గృహ నిర్మాణాల ప్రగతి పరిశీలన

రాయవరం: సోమేశ్వరంలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను బుధవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సీఈ జి.వీరేశ్వరప్రసాద్ పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్ల గృహ ప్రవేశాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సోమేశ్వరం జగనన్న కాలనీని ప్రారంభోత్సవానికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఇంటర్నల్ రహదారులకు రూ.32 లక్షలు, స్వాగత ఆర్చికి రూ.6 లక్షలు మంజూరు చేశామన్నారు. వచ్చే నెల 2వ తేదీకి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సర్పంచ్ ఆరిఫ్, గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చల్లా బాబూరావు, ఈఈ మల్లికార్జున రావు, డీఈఈ రఘురామ్‌కుమార్ పాల్గొన్నారు.

దిశా నిర్దేశం

- పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ
- అధికారులకు జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీ రాణి సూచనలు




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీ రాణి తదితరులు

అమలాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రమాణాలు మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ ఆదేశించారు. బుధవారం వారు అమరావతి నుంచి 26 జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీ రాణి వైద్య ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ వైద్య శిబిరాల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఎంపీడీవోలు, తహసీల్దార్లు గ్రామీణ ప్రాంతాల్లో, మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో చేస్తారని ఆమె స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన నిధులను గ్రామీణ ప్రాంతాల్లోని సంబంధిత సచివాలయాలకు, మున్సిపల్ కమిషనర్లకు విడుదల చేశామన్నారు. స్థానిక ప్రజాప్రతి నిధులకు ముందుగా తెలియజేసి శిబిరాల ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని సూచించారు. ఏఎస్ఎం, హౌస్‌హోల్డ్ సర్వే వలంటీర్ క్యాంపును ప్రారంభించడానికి ముందు హౌస్‌హోల్డ్ సర్వేను100 శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హెల్ప్‌డెస్క్ టోకెన్ సేకరణ కౌంటర్, కేసు షీట్ కౌంటర్, నాలుగు వైద్యుల కౌంటర్లు ఉండాలన్నారు. వీటిలో చిన్నారుల, ప్రసూతి వైద్య నిపుణుల కోసం తప్పనిసరిగా కౌంటర్లు ఉండాలన్నారు. స్పాట్ సర్వే, ల్యాబ్ టెస్టింగ్, మందుల పంపిణీ, అత్యవసరాలకు సంబంధించి కౌంటర్లు ఉండాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సహాయ కేంద్రం, కంటి వైద్య పరీక్షలకు, పోషకాహారానికి కౌంటరులు ఉండాలన్నారు. ప్రతి డాక్టర్ వద్ద అసిస్టెంట్‌ను నియమించి వైద్య పరీక్షల నిర్వహణ అనంతరం ఆయా వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా గ్రామ సచివాలయాల నోడల్ అధికారి కె. భీమేశ్వరరావు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ సుమలత, అదనపు డీఎం అండ్ హెచ్ఓ సీహెచ్ భారత లక్ష్మి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ఆంథ్రోస్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మేటివ్-2 పరీక్షలకు వేళాయె

- అక్టోబర్ 3 నుంచి పాత విధానంలో నిర్వహణ
- ప్రధానోపాధ్యాయుల ఈ–మెయిల్‌కు ప్రశ్నపత్రాలు
- సిద్ధమవుతున్న 2.02 లక్షల మంది విద్యార్థులు
- నిర్వహణ ఏర్పాట్లలో జిల్లా విద్యాశాఖ



రాయవరం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను వెలికితీసేందుకు నిర్వహించే ఫార్మేటివ్–2 పరీక్షలు అక్టోబర్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు గత నెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన విషయం విదితమే. వచ్చే నెల మూడున ప్రారంభమయ్యే పరీక్షలు 6వ తేదీ ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ఉమ్మడి పరీక్షా పత్రం ద్వారానే పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. ఫార్మేటివ్–1 క్లాస్ రూమ్ బేస్డ్‌గా ఓఎంఆర్ ద్వారా నిర్వహించగా, ఫార్మేటివ్–2 పరీక్షలు పాత విధానంలో నిర్వహించనున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,580 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలుండగా, 456 ప్రైవేట్ యాజమాన్యంలో 456 పాఠశాలలున్నాయి. 1–5 తరగతుల వరకు ప్రభుత్వ యాజమాన్యంలో 42,014 మంది, ప్రైవేట్ యాజమాన్యంలో 56,313 మంది విద్యార్థులు చదువుతున్నారు. 6–10 తరగతుల వరకు ప్రభుత్వ యాజమాన్యంలో 66,719 మంది, ప్రైవేట్ యాజమాన్యంలో 37,486 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. జిల్లాలో 2,036 ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల్లో 2,02,532 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పరీక్షల షెడ్యూల్‌లో ముఖ్యాంశాలివీ..

ఎఫ్ఏ–2 పరీక్షలు అక్టోబర్ 3,4 తేదీల్లో 1–5 తరగతి వరకు విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహిస్తారు. 3న తెలుగు, గణితం, 4న ఈవీఎస్, ఇంగ్లిష్ పరీక్షలు నిర్వహిస్తారు. 5న 3–5 తరగతుల విద్యార్థులకు ఓఎస్ఎస్‌సీ పరీక్ష ఉదయం నిర్వహిస్తారు. 6,7,8 తరగతుల విద్యార్థులకు 3న తెలుగు, గణితం, 4న హిందీ, జనరల్ సైన్స్, 5న సోషల్, ఇంగ్లిష్, 6న ఓఎస్ఎస్‌సీ–1, ఓఎస్ఎస్‌సీ–2 పరీక్షలు నిర్వహిస్తారు. 9,10 తరగతులకు 3న తెలుగు, గణితం, 4న హిందీ, జనరల్ సైన్స్, 5న సోషల్, ఇంగ్లిష్, 6న ఓఎస్ఎస్‌సీ–1, ఓఎస్ఎస్‌సీ–2 పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 10.30, మధ్యాహ్నం 1.20 నుంచి 2.20 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. 3,4,5 తరగతులకు ఇంగ్లిష్ పార్ట్–బి మధ్యాహ్నం 2.30 నుంచి 2.50 గంటల వరకు నిర్వహించనున్నారు. 6–8 తరగతులకు మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకు ఒక పరీక్ష, 2.20 నుంచి 3.20 గంటల వరకు ఒక పరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లిష్ పార్ట్–బి మాత్రం 3.30 గంటల నుంచి 3.50 గంటల వరకు నిర్వహిస్తారు. 9,10 తరగతులకు ఉదయం 9.30 నుంచి 10.15, రెండో పరీక్ష ఉదయం 10.30 నుంచి 11.15 గంటల వరకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ పార్ట్–బి మాత్రం ఉదయం 11.30 నుంచి 11.50 గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రశ్న పత్రాన్ని బ్లాక్ బోర్డుపై ఉపాధ్యాయులు రాయగా, విద్యార్థులు నమోదు చేసుకుని, సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అన్ని మేనేజ్‌మెంట్ల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష పేపర్లను మెయిల్‌లో పంపిస్తారు. ఆ పేపర్లను సంబంధిత ప్రధానోపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుంది.

ఈ ఒక్క పరీక్ష మాత్రమే



ఫార్మేటివ్–2 ప్రశ్నపత్రాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ–మెయిల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఈ ఒక్క పరీక్ష మాత్రమే ఈ విధంగా నిర్వహించేలా ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ఆదేశాలు వచ్చాయి.

– బి. హనుమంతురావు, ప్రధాన కార్యదర్శి, డీసీఈబీ, అమలాపురం.

పొరపాట్లకు తావు లేకుండా..



ఫార్మేటివ్–1 పరీక్ష నిర్వహించిన మాదిరిగానే ఫార్మేటివ్–2 పరీక్షను సక్రమంగా నిర్వహించాలి. పాఠశాలల హెచ్‌ఎంలు ఎటువంటి పొరపాట్లకు తావులేని విధంగా నిర్వహించాలి. ఎక్కడ ఏ విధమైన పొరపాట్లు తలెత్తినా హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

పాత విధానంలోనే..



ఫార్మేటివ్–2 పరీక్షలు పాత విధానంలోనే నిర్వహిస్తున్నాం. పేపరు డౌన్‌లోడ్ చేసుకుని నిర్వహించాల్సిన విషయంపై కూడా అవగాహన కల్పించాల్సిందిగా డీఈవోలకు సూచించాం. గత విద్యా సంవత్సరం ఫార్మేటివ్–2 పరీక్షను ఇదే మాదిరిగా నిర్వహించిన అనుభవం ఉపాధ్యాయులకు ఉంది.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ.

క్లుప్తంగా

బిక్కవోలు లడ్డు రూ.77,777



పాటదారుకు లడ్డును అందిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ వీర వెంకట సుబ్బారెడ్డి

బిక్కవోలు: స్థానిక శ్రీ లక్ష్మీ గణపతిస్వామి ఆలయంలో లడ్డుకు వేలంపాట నిర్వహించారు. బుధవారం గణపతి నవరాత్రులలో భాగంగా ఆలయం వద్ద 50 కేజీ లడ్డు పాట నిర్వహించగా సోమేశ్వరం గ్రామానికి చెందిన కనకాల కృష్ణతేజ రూ.77,777కు దక్కించుకున్నారు. ఆయనకు ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్‌రెడ్డి లడ్డును అందించారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు సుహాన



సుహాన చాంది

కొత్తపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో కొత్తపేటకు చెందిన అంబటి సుహాన చాంది విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ పీఆర్ కళాశాల గ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన స్కేటింగ్ పోటీలు రింగ -2 విభాగంలో సుహాన చాంది తృతీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని, రింగ్-3 విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. సుహాన స్థానిక ప్రైవేటు స్కూలులో చదువుతోంది.

గెలుపు పొందు వరకు... అలుపు లేదు మనకు!



రోప్ స్కిప్పింగ్ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న పీఈటీ సాధన



నేషనల్ రోప్ స్కిప్పింగ్ పోటీలకు ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారిణులు

- జాతీయ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ లక్ష్యం
- గురుకుల విద్యార్థినులు ముమ్మరంగా సాధన
- 29 నుంచి 4 వరకు నాసిక్‌లో 24వ జాతీయ పోటీలు

తుని రూరల్: జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్‌లో తమ ప్రతిభా నైపుణ్యాన్ని ప్రదర్శించి, చాంపియన్ షిప్ సాధించడమే లక్ష్యంగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. గత నెల 12, 13 తేదీల్లో భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో తుని మండలం వి.కొత్తూరు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. అండర్ -17 విభాగంలో బి.గీతిక, కె.స్నేహ, టి.పావని, అండర్ -14 విభాగంలో ఎ.హసీల, వై.జ్యోతి విశేష ప్రతిభను ప్రదర్శించారు. రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన మహారాష్ట్ర నాసిక్‌లో జరగనున్న 24వ ఆర్ఎస్ఎఫ్ఐ జాతీయ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ - 2023 పోటీలకు ఈ ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 29 నుంచి అక్టోబర్ నాలుగు వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో నేషనల్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ - 2023 పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పాల్గొని చాంపియన్ షిప్ సాధించడమే లక్ష్యంగా విద్యార్థినులు నిర్విరామంగా సాధన చేస్తున్నారు. తొమ్మిదో తరగతి చదువుతూనే విద్యార్థినులు రోప్ స్కిప్పింగ్ సాధనలో పాల్గొంటున్నారు.

పీడీ, పీఈటీల పర్యవేక్షణలో శిక్షణ

జిల్లా, రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ ప్రదర్శించిన తమ విద్యార్థినులు జాతీయ స్థాయిలో రాణించనున్నారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల (వి.కొత్తూరు) ప్రిన్సిపాల్ నిర్మల కుమారి పేర్కొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ ఆర్. రాజ్యలక్ష్మి, పీఈటీ సాధన పర్యవేక్షణలో బాలికలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

నేషనల్స్‌కు సిద్ధమయ్యాను



నేషనల్స్‌లో విజయం సాధించేందుకు అనువుగా సాధన చేశాను. జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నాను.

– బి.గీతిక, అండర్ 17

సంతోషంగా ఉంది



జాతీయస్థాయిలో జరిగే రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ రోప్ సిప్పింగ్‌లో విజయం సాధిస్తానన్న నమ్మకం, ఆత్మ విశ్వాసం ఉంది.

– టి.పావని, అండర్ 17

గోల్డ్‌మెడల్ సాధిస్తా



జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైనప్పటి నుంచి రోజూ సాధన చేస్తున్నాను. నెలరోజులకుపైగా శిక్షణ పొందాను. పీఈటీ, పీడీ ఆధ్వర్యంలో మెళకువలు నేర్చుకున్నాను. జాతీయ స్కిప్పింగ్ పోటీల్లో విజయం సాధించి గోల్డ్‌మెడల్ సాధిస్తాను.

– కె.స్నేహ, అండర్ 17

ప్రోత్సాహంతోనే



రాష్ట్ర ప్రభుత్వం, మా పాఠశాల ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్, పీఈటీల ప్రోత్సాహంతోనే జాతీయ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది. మెడల్ సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తాను.

– ఎ.హసీల, అండర్ 14

అదృష్టంగా భావిస్తున్నా



అండర్ 14 విభాగంలో జాతీయ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికవడం అదృష్టంగా భావిస్తున్నాను. వచ్చిన అవకాశంతో నాసిక్‌లో జరిగే నేషనల్ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో విజేతగా నిలుస్తాను – వై.జ్యోతి, అండర్ 14

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు నాని



హత్య కేసు నిందితుడిని పెద్దాపురం డీఎస్పీ కార్యాలయానికి తీసుకువస్తున్న పోలీసులు

పెద్దాపురం: మైనర్ బాలికను ఎత్తుకెళ్లి హత్య చేసి పరారైన నిందితుడు బత్తిన నాని ఎట్టకేలకు పెద్దాపురం పోలీసులకు చిక్కాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కలవచర్ల సమీపంలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 20వ తేదీన పదేళ్ల ద్రోణ ప్రవీణకుమారి అలియాస్ మానస అదృశ్యమైనట్లు తల్లి జ్యోతి పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి మానస ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులకు మృతదేహం కనిపించడంతో మరింత లోతుగా దర్యాప్తు చేశారు. దీంతో బాలిక సమీప బంధువు బత్తిన నాని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని గుర్తించిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేసి ఎట్టకేలకు బుధవారం కలవచర్ల సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడు నానిని విచారణ కోసం పెద్దాపురం డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు చేసిన కృషిని ప్రజా సంఘాలు, కుటుంబ సభ్యులు అభినందించారు. పోలీస్ స్టేషన్ వద్ద టపాసులు పేల్చి పోలీస్ యంత్రాంగం చూపిన చొరవపై కృతజ్ఞతలు తెలిపారు. ఒక్కడే హత్య చేశాడా? మరెవరి హస్తమైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు నిరంజన్



నిరంజన్‌ను అభినందిస్తున్న ప్రముఖులు

సఖినేటిపల్లి: మండల పరిధిలోని అప్పనరామునిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తోటి నిరంజన్ అండర్-14 విభాగంలో త్రో బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి టీంకు ఎంపికైనట్టు బుధవారం హెచ్ఎం జేవైకే సత్యనారాయణ తెలిపారు. అనపర్తిలో జరిగిన ఈ పోటీల్లో నిరంజన్ అర్హత సాధించినట్టు చెప్పారు. సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, మాజీ సర్పంచ్ మంగెన స్వామినాయుడు, ఎంఈవో-2 మద్దాలి వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బర్రె సీతామహలక్ష్మి, వైస్ చైర్మన్ నల్లి ఝాన్సీ నిరంజన్‌ను అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన గణేష్



వినయ్



కరుణాకర్

ప్రతిభ చూపిన గణేష్

ఆత్రేయపురం: రాష్ట్ర స్థాయి అండర్ -14 త్రోబాల్ పోటీలకు తమ విద్యార్థి గాజుల జయ వెంకట సాయి గణేష్ ఎంపికైనట్లు ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్ చైర్మన్ ఎన్వీ రామరాజు తెలిపారు. ఇటీవల అనపర్తిలో జరిగిన పోటీలో అతను ప్రతిభ చూపాడన్నారు.

ఇద్దరు విద్యార్థుల ఎంపిక

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లి బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక అయ్యారని హెచ్ఎం గాలిదేవర శ్రీనివాసరావు తెలిపారు. త్రోబాల్ అండర్-14 విభాగంలో 9వ తరగతి విద్యార్థి పోతుల వినయ్, అండర్-17 విభాగంలో 10వ తరగతి విద్యార్థి కటికదల కరుణాకర్ ఎంపిక అయ్యారని ఆయన వివరించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ఇద్దరికి స్వల్పగాయాలు

దేవరపల్లి: మండలంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద హైవే ఫ్లైఓవర్‌పై బుధవారం అర్ధరాత్రి సమయంలో ఓ వ్యాన్ ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ ఎస్‌కే అన్వర్ ఆలీ(38) మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతున్న కారును బుధవారం తెల్లవారుజామున దేవరపల్లి నుంచి గోపాలపురం రోడ్డులో ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ మోయ్యే కృష్ణ(41) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కర్రి ప్రకాష్, తాటిపాక పోలురాజు స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీహరిరావు తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



కిరణ్ మృతదేహం

నిడదవోలు రూరల్: ప్రేమ విఫలమై మనస్తాపంతో పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ బుధవారం తెలిపారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన ముప్పిడి మందులయ్య కుమారుడు కిరణ్ (19) రావిమెట్లకు చెందిన ఒక బాలికను ప్రేమించాడు. అయితే కిరణ్ ప్రేమకు పెద్దలు అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 26న మంగళవారం గోపవరంలో తాను పనిచేస్తున్న గేదెల ఫామ్ వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న కిరణ్‌ను స్నేహితులు నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసేవలందిస్తుండగా మృతిచెందినట్లు తండ్రి మందులయ్య ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభానీ పేర్కొన్నారు. చేతికొచ్చిన కుమారుడి అకాల మృతితో తల్లి మణితో పాటు కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతు



రాకేష్ (ఫైల్)

ఆలమూరు: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని మడికిలో బుధవారం చేపట్టిన నిమజ్జనం కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అత్తిలి రాకేష్ (22) తన సహచరులతో 216ఏ జాతీయ రహదారి వద్ద ఉన్న రేవు వద్ద జరిగిన నిమజ్జనం ఉత్సవంలో పాల్గొన్నాడు. నిమజ్జనం చేసే క్రమంలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. ఆలమూరు పోలీసుల సహకారంతో స్థానికులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టినా రాకేష్ ఆచూకీ రాత్రి పొద్దుపోయే వరకూ లభ్యం కాలేదు. రాకేష్ ఎంబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాజులూరు: యానం, ద్వారపూడి రహదారిలో మండలంలోని కోలంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుగ్గుదుర్రు శివారు పాలమూరుపాడుకు చెందిన పాలుగుమాటి వెంకటదుర్గాప్రసాద్ (32) మృతి చెందాడు. దుర్గాప్రసాద్ కోలంకలోని కిరాణా షాపు నుంచి సామాన్లు కొనుగోలు చేసుకుని తన మోటారు బైక్‌పై ఇంటికి తిరిగి వెళుతున్నాడు. కోలంక అటుకులు మిల్లు వద్దకు వచ్చే సరికి ద్రాక్షారామ వైపు వెళుతున్న మరో బైక్ ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. దుర్గాప్రసాద్ తలకు బలమైన గాయమవడంతో స్థానికులు అతనిని యానాం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గొల్లపాలెం ఎస్సై ఎస్.తులసీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుర్గాప్రసాద్‌కు తల్లి, ఇద్దరు అక్కలు, ఒక తమ్ముడు ఉన్నారు. ఇద్దరు అక్కలకు వివాహాలు జరుగగా, అతనికి ఇంకా వివాహం కాలేదు.

నలుగురు దొంగల అరెస్ట్


- రూ.7లక్షల విలువైన బంగారం వగైరా స్వాధీనం
- చోరీ సొత్తు కొన్న ఇద్దరిపై కేసు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను ప్రకాశ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 121 గ్రాముల బంగారం, మూడు సెల్‌ఫోన్లు, నాలుగు మోటారు బైకులు స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశ్‌నగర్ పోలీసు స్టేషన్లో బుధవారం విలేకరులకు సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఆ వివరాలను తెలిపారు. రాజమహేంద్రవరం చుట్టు పక్కల జరుగుతున్న చోరీలపై ప్రత్యేక నేర నిరోధక బృందాలు సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన పోలవరపు నాగ దుర్గాప్రసాద్, ఏలూరు జిల్లా ఏటిగట్టు చేపల తూము ప్రాంతానికి చెందిన అత్తోటి జాన్‌పాల్, భీమడోలు మండలం గణపతి సెంటర్‌కు చెందిన తల్లిబోయిన నాగ దుర్గారావు, భీమడోలు రైల్వే గేట్ ప్రాంతానికి చెందిన కర్నాటి విజయకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు నేరాలు చేసిననట్టు ఒప్పుకున్నారు. ప్రకాశ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో నాలుగు ఇళ్లలో, మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు ఇళ్లలో దొంగతనాలు చేశారు. పెనుగొండ, నిడమర్రు, గణపవరం ప్రాంతాల్లో నాలుగు బైకులు దొంగతనం చేశారు. నిందితుల్లో ఒకరైన పోలవరపు నాగదుర్గా ప్రసాద్ పై 29 పాత కేసులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. చోరీ సొత్తు కొనుగోలు చేసిన చిక్కాల రారాజు, మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. రికవరీలో ప్రతిభ కనబరిచిన ఎస్సైలు పి.ప్రేమ్‌రాజ్, బి.హరిబాబు, కానిస్టేబుళ్లు వి.నాగరాజు, బి.విజయకుమార్, పి.పోసిరాజు, సీహెచ్ శేషు, ఎస్.గణేశ్వరరావు, డి.రాజశేఖర్, జి.సుమన్‌కు డీఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆదిత్య కళాశాలలకు అటానమస్ హోదా



ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య కళాశాలలకు అటానమస్ హోదా లభించినట్టు కళాశాలల వైస్ చైర్మన్ ఎన్. సతీష్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో ఉన్నత ప్రమాణాలను ప్రాతిపదికగా తీసుకుని యూజీసీ ఈ స్టేటస్‌ను ప్రకటించినట్టు తెలియజేశారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలకు ఈ విద్యాసంవత్సరం 2023-24 నుంచి 2028-29 వరకు, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలకు 2023-24 నుంచి 2032-33 వరకు, ఆదిత్య ఫార్మసీ కళాశాలలకు పది సంవత్సరాలు ఈ అటానమస్ స్టేటస్ పొందినట్టు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) న్యూఢిల్లీ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఈ స్టేటస్ సాధించేందుకు కృషిచేసిన ఆదిత్య విద్యాసంస్థల సిబ్బందికి కళాశాల చైర్మన్ ఎన్. శేషారెడ్డి, సతీష్‌రెడ్డి, తదితరులు అభినందనలు తెలియజేశారు. క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్, కె.రవిశంకర్, డి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

140 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

తాళ్లరేవు: యానాం నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న భైరవపాలేనికి చెందిన సార్ర వెంకటేశ్వర్లును బుధవారం అరెస్ట్ చేసి, 140 మద్యం బాటిళ్లు, మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ భవాని తెలిపారు. నిందితుడికి కోర్టుకు రిమాండ్ విధించినట్టు తెలిపారు.

ప్రతి రైతూ వ్యాపార వేత్తగా ఎదగాలి

సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్



ఏపీసీఎన్ఎఫ్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంటున్న సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రతి రైతు ఒక వ్యాపార వేత్తగా ఎదిగినప్పుడే ఆర్థికాభివృద్ధి చెందుతారని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. స్థానిక సీటీఆర్ఐ సెమినార్ హాల్లో ఆయన అధ్యక్షతన ×ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలలో వాణిజ్య వ్యాపారాలలో అవకాశాలు₹ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శేషుమాధవ్ మాట్లాడుతూ పొగాకుతో పాటు పసుపు, మిర్చి, అశ్వగంధ, ఆముదంపై కూడా పరిశోధనలు నిర్వహిస్తామన్నారు. విలువ జోడింపు, సహకార సంస్థల అనుసంధానంతో వాణిజ్య వ్యవసాయంపై దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు. టాపింగ్ టూల్, పాలీట్రీప్రెస్సింగ్ మెషీన్, టుబాకో బేల్ ప్రెస్సింగ్ మెషీన్ తదితర సీటీఆర్ఐ వాణిజ్యీకరించిన, లైసెన్స్ పొందిన టెక్నాలజీల గురించి వివరించారు. ఐసీఏఆర్-సీటీఆర్ఐ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి ఏపీసీఎన్ఎఫ్‌తో అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయూ) ఈ సందర్భంగా కుదుర్చుకున్నారు. ఐసీఏఆర్-సీటీఆర్ఐ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఐఎంటీయూ) నోడల్ ఆఫీసర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ హెచ్.రవిశంకర్, కలవచర్ల కేవీకే హెడ్ డాక్టర్ ఎస్‌జీఆర్ నాయుడు, ఐసీఏఆర్ డైరెక్టరేట్ ఆఫ్ ఫ్లోరీకల్చర్ రీసెర్చ్‌హెడ్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ డీవీఎస్ రాజు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ ఆధారిత నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు, డాక్టర్ వైఎస్సార్ హెచ్‌యూ ఉద్యాన పరిశోధన స్థానం సీనియర్ సైంటిస్ట్ పీసీ వెంగయ్యలు కొబ్బరి, తాటి ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ జోడింపు, పూల సాగులు వాణిజ్యపరమైన అంశాలపై మాట్లాడారు. ఫార్మర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సి.చంద్రశేఖరరావు పొగాకులో వాణిజ్యపరంగా లైసెన్స్ పొందిన టెక్నాలజీస్పైన, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.సుమన్‌కళ్యాణి పసుపు, మిరపలో విలువ జోడింపు అంశాలపై చర్చించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు మావిరెడ్డి శ్రీనివాస్ (పశుగ్రాసం), టెడ్డీప్రసాద్ (మిల్లెట్స్), జి.అశోక్, సీఈవో, కేవీకే (పసుపు), ఎన్.ఫణికుమార్, కె.మురళీకృష్ణ (కొబ్బరి పరిశ్రమ), హెచ్‌వీ ప్రసాద్, ఏ.కాశీవిశ్వనాథం వెంకటరమణ (ప్రకృతి వ్యవసాయం), సత్యనారాయణ (పసుపు, మిర్చి), పలువురు ఎన్‌జీవోలు తమ అనుభవాలను పంచుకున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కృషికి గుర్తింపుగా విశిష్ట అతిథుల చేతులమీదుగా మెమెంటోలు అందించారు. సీటీఆర్ఐ విభాగాల అధిపతులు, శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సీఈవోలు, డైరెక్టర్లు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, రైతులు, రైతు మహిళలు, రాజానగరం, కోరుకొండ, పెరవలి, ఉండ్రాజవరం, నరేంద్రపురం, నిడదవోలు గ్రామాల నుంచి ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

అమలాపురం పట్టణ సీఐగా క్రాంతికుమార్



క్రాంతికుమార్

అమలాపురం టౌన్: స్థానిక సీఐగా టి.క్రాంతి కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ క్రైమ్ ఎస్సైగా పని చేసిన క్రాంతికుమార్ పదోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. స్థానిక పట్టణ పోలీసు సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్‌లను వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు.

పట్టణ ఎస్సైగా జోషి

అమలాపురం పట్టణ ఎస్సైగా మనోహర్ జోషి బాధ్యతలు చేపట్టారు. ఈయన రాజమహేంద్రవరం టూ టౌన్ ఎస్సైగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.